


*రేపో మాపో పెళ్ళంట*

**డబ్బెవరికి చేదు?** విటంన్ యం ల తర్వాత వీలునామా నేపథ్యంతో నేను రాసిన మూడో కామెడీ నవల 'రేపో మాపో పెళ్ళంట'. 1997 చివర్లో ఆంధ్రప్రభ డైలీకి రాసిన ఆఖరి సీరియల్ ఇది. ఆ తర్వాత ప్రభ డైలీ చేతులు మారాక మళ్ళీ ప్రభ నించి సీరియల్ కోరలేదు. వీక్లీలో వచ్చిన గగనసీమ పాఠకులకి నచ్చడంతో డైలీకి సీరియల్ అడిగారు. 1997 దీపావళి సంచికలో ఇది ఆరంభమైంది.




డైలీ సీరియల్ కాబట్టి నిత్యం సస్పెన్స్‌తో ఉండే సబ్జెక్ట్‌ని తీసుకోవాలి అనుకున్నాను. కామెడీ నేపథ్యంతో నేను అప్పటికే అల్లుకున్న కథని రేపో మాపో పెళ్ళంటగా రాసాను. సీరియల్స్ బాగా చదివే చివరి రోజులవి. దీనికి మంచి స్పందన వచ్చిందని సీరియల్ పేజ్ ఇన్‌ఛార్జ్ ఎప్పటికప్పుడు చెప్తూండేవాడు.

ప్రతీ నవల మొదట్లో ఆ నవల ఇతివృత్తానికి సరిపడే ఓ ఇంగ్లీష్ కొటేషన్‌తో మొదలు పెడతాను. దీంట్లోని కొటేషన్ The value of the rupee will never drop as low as some people will stop to get it (రూపాయి విలువ దాన్ని సంపాదించడానికి కొందరు మనుషులు ఎంత దిగజారుతారో అంతగా దిగజారదు)

'నాన్సేయ్! గొప్ప శుభవార్త. పూర్ణానందంగారు మరణించారు' హీరోయిన్ వల్లరి డైలాగ్‌తో ఈ కామెడీ నవల ఆరంభం అవుతుంది. మరణం శుభవార్త ఎలా అవుతుందనే ప్రశ్న పాఠకుల్లో కలుగుతుంది. ఈ నవల నేపథ్యం ఇదే

ఓసారి రీడర్స్ డైజెస్ట్‌లో టోన్‌టైన్ అగ్రిమెంట్ మీద ఓ వ్యాసం చదివాను. ఇది ఫ్రాన్స్‌లో 16వ శతాబ్దం నించి అమల్లో ఉంది. వారసులు లేని ఎవరైనా వృద్ధులు తమ తదనంతరం తమ ఆస్థి ఫలానా వాళ్ళకి చెందేలా వీలునామా రాస్తారు. ఆ ఫలానా వాళ్ళు తమని జీవితాంతం ఆర్థికంగా పోషించాలనే షరతు ఉంటే అది టోన్‌టైన్ అగ్రిమెంట్ అవుతుంది. కారణం వృద్ధులు తమ ఆస్థిని అమ్మేసి బేంక్‌లో వేసుకున్నాక కొంతకాలానికి అది ఖర్చుఅయిపోయి చేతిలో చిల్లిగవ్వ లేని స్థితికి చేరుకోవచ్చు. అమ్మకపోతే అది అన్యాక్రాంతం అవుతుంది. ఈ రెండు ప్రయోజనాలని దృష్టిలోఉంచుకుని టోన్‌టైన్ అగ్రిమెంట్ పద్ధతి ఫ్రాన్స్‌లో అమల్లోకి వచ్చింది. పోషించబడే వారు ఎంత త్వరగా

మరణిస్తే ఈ అగ్రిమెంట్ చేసుకున్నవారికి అంత లాభం. ఐతే ఒకోసారి పోషించే వాళ్ళు ముందుగా మరణించి, విల్లు రాసిన వాళ్ళు వందేళ్ళు జీవించిన ఉదంతాలు కూడా ఉన్నాయి. టోన్‌టైన్ నేపథ్యంలో కొన్ని కథలని కూడా చదివాను. అందులో నాటకీయతకి చోటుండటంతో ఈ పాయింట్ చుట్టూ కథని అల్లుకున్నాను.

సూక్ష్మంగా ఇదీ కథ.

కథాకాలానికి ఏభై ఏళ్ళ ముందు ఓ గ్రామంలోని ఏభై మంది ఇలాంటి అగ్రిమెంట్‌ని చేసుకుంటారు. అంతా సమాన మొత్తాలని ఇంపీరియల్ బేంక్‌లో డిపాజిట్ చేసి, తమ వారసుడి పేరుని సూచిస్తారు. టోన్‌టైన్ అగ్రిమెంట్ ప్రకారం వారిలో ఆఖరుదాకా జీవించిన వారసుడికి ఆ డబ్బుని అందచేయాలనే నిబంధనతో ఆ డిపాజిట్‌ని బేంక్ మేనేజర్ స్వీకరించాడు.

కథాకాలంలో ఆ ఏభైమంది వారసుల్లో ముగ్గురే జీవించి ఉన్నారు. ఆ ముగ్గురిలోని ఒకరైన పూర్ణానందం మరణించడంతో ఇక ఇద్దరు మాత్రం మిగిలి ఉన్నారు. వారు మధ్య తరగతి కుటుంబానికి చెందిన పరంధామం, సంపన్నుడైన హయగ్రీవం. వీళ్ళిద్దరికీ పెళ్ళీడుకొచ్చిన చెరో కూతురు ఉంది. హయగ్రీవం భార్య గయ్యాళి. బేంక్ డిపాజిట్‌ని ముందుగా క్లోజ్ చేసి ఇద్దరూ చెరిసగం పంచుకోవాలని పరంధామం సూచిస్తాడు. హయగ్రీవం అందుకు అంగీకరించినా అతని భార్య ఒప్పుకోదు. పరంధామం ముందు పోవాలని నిత్యం దైవపూజ చేస్తూ, బి.పి డయాబెటిస్ లాంటి రోగాలున్న హయగ్రీవం జీవించాలని అతన్ని బలవంతంగా వాకింగ్‌కి పంపుతూ, డైటింగ్ చేయిస్తూ హింసిస్తూంటుంది.

కపిరాజు అనే విలన్‌కి ఈ అగ్రిమెంట్ గురించి తెలిసి వారి ఇద్దరు అమ్మాయిలతో, ఒకరికి తెలీకుండా మరొకరి కూతురితో తన కొడుక్కి పెళ్ళి నిశ్చయం చేస్తాడు. తన కూతురు వేరే వ్యక్తిని ప్రేమించిందని తెలిసిన హయగ్రీవం భార్య కపిరాజు కొడుకుతో తన కూతురి పెళ్ళిని రద్దు చేసింది. దాంతో కపిరాజు పరంధామం కూతురితో కొడుకు పెళ్ళి జరిపించాలనుకుని, హయగ్రీవాన్ని చంపడానికి కిరాయి రౌడీని నియమిస్తాడు హత్యాప్రయత్నాలు, అవి విఫలం అవడం హాస్యంగా సాగుతుంది. అది బయటపడి కిరాయి హంతకుడిని నియమించిన కపిరాజు జైలుకి వెళ్తాడు. చివరికి పరంధామం, హయగ్రీవం ఒకే రాత్రి నిద్రలో మరణిస్తారు. ఎవరు ఎప్పుడు పోయారో తెలీకపోవడంతో ఇద్దరి భార్యలు తమ భర్త ఆలస్యంగా పోయాడంటే, తమ భర్త ఆలస్యంగా పోయాడని వాదించుకుంటారు. పిల్లలు జోక్యం చేసుకుని ఒకరు ముందు పోయినట్లుగా డెత్ సర్టిఫికెట్ తీసుకుని దాన్ని బేంక్‌కి సబ్మిట్ చేసి వచ్చిన డిపాజిట్‌ని చెరి సగం పంచుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.

పి.ఎస్.నారాయణగారు రాసిన ఓ చిన్న కథని ఆయన అనుమతితో తీసుకుని మన్మథరావు, సర్వాంగసుందరి అనే మరో రెండు పాత్రలని ఈ నవల్లో కామెడీ ట్రాక్‌గా వాడాను.

దీన్ని లిపి పబ్లికేషన్స్ జనవరి 1998లో పుస్తకంగా ముద్రించింది. 244 పేజీలు. వెల 50రూ. ఇది చంటబ్బాయ్‌లా చాలా వేగంగా అమ్ముడైన కామెడీ నవల. కొద్ది నెలల్లో రెండో ఎడిషన్ రాబోతోంది. కన్నడంలో సీరియల్‌గా వెలువడింది. నవలగా కూడా వచ్చింది.

నేనుండే గాంధీనగర్లోనే అబ్బాయ్ హోటల్ అని అప్పట్లో కొత్తగా పెట్టారు. దాని యజమాని శ్రీ రాజమోహన్ 1998 జూలైలో ఓ రోజు మా ఇంటికి వచ్చి, లక్ష్మీనారాయణరెడ్డిగారి భాగస్వామ్యంలో సినిమా తీయదలచుకున్నానని, నేను గాంధీనగర్లోనే ఉంటానని తెలిసి వచ్చానని, మంచి కథేమైనా ఉందా అని అడిగారు. రేపోమాపో పెళ్ళంట కథ చెప్పాను.

అతను సినిమా నిర్మాణానికి కొత్త. తనికెళ్ళ భరణి, తను సీతాఫల్‌మండిలో ఒకే చోట అద్దెకి ఉన్నామని, అంతకుమించి తనకి సినిమా వాళ్ళతో పరిచయాలు లేవని చెప్పారు. కోదండరామిరెడ్డిని కలుస్తానని నవల కాపీ తీసుకున్నారు. రెండు సంవత్సరాలనించి శ్రీ జంధ్యాల ఖాళీగా ఉండటంతో ఆయన మనసుపెట్టి తీస్తారని నమ్మి కామెడీల్లో దిట్టయిన జంధ్యాలగారి పేరుని సూచించాను. రెండు రోజుల తర్వాత రాజ్‌మోహన్ వచ్చి, జంధ్యాలగారి అలవాట్ల వల్ల ఆయనతో సినిమా తీయొద్దని కొందరు మిత్రులు డిస్ట్రిబ్యూషన్ లైన్లో ఉన్న తన

భాగస్వామికి సూచించారని చెప్పారు. ఆయన్నే కలిసి మాట్లాడి చూడమని వెంటనే జంధ్యాలగారితో మాట్లాడాను. సికింద్రాబాద్ క్లబ్‌లో నిర్మాతలు ఇద్దర్నీ పరిచయం చేసాను.

సినిమా పూర్తయ్యేదాకా తన ఏకాగ్రత అంతా దానిమీదే ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదని జంధ్యాలగారు హామీ ఇచ్చాక, రెడ్డిగారు చేతిలో చెయ్యి వేయించుకుని చెప్పారు.

"తెలుగులో కామెడీ తీయడానికి మీరు తప్ప ఇంకెవరూ లేరు. కాబట్టి మీ అలవాట్లని పక్కన పెట్టి జాగ్రత్తగా తీస్తానని మాట ఇవ్వండి."

'ష్ గప్‌చుప్' సినిమా తర్వాత, ఇరవై నాలుగు గంటల్లో షూటింగ్ ముగించే (అంటే ముహూర్తం షాట్ మొదటి గంటలో, ముగింపు షాట్ ఇరవై నాలుగో గంటలో) సినిమా చేయాలని ఆయనకి తపన ఉండేది. అందుకో కథ విషయంలో జంధ్యాలగారికి సహకరించాను. స్టేజ్ మీద జరిగే ఓ నాటకంలో రివాల్వర్ పేల్చాల్సిన అవసరం ఉంటుంది. గ్రీన్‌రూంలోని రివాల్వర్‌ని దర్శకుడు నాటకం ముందు చెక్ చేస్తే గుళ్ళుండవు. కానీ హీరోని చంపాలనుకునే విలన్ రివాల్వర్లో ఓ గుండుని రహస్యంగా నింపుతాడు. అది పేలే సమయం దగ్గరయ్యే కొద్దీ సస్పెన్స్. ఇలా సాగుతుందా కథ. ఆ విషయం ఆయన గుర్తు చేసి ఇంకా నిర్మాత దొరకలేదని చెప్పారు. 'రేపో మాపో పెళ్ళంట' తర్వాత దాన్ని సినిమాగా చేద్దామని రాజ్‌మోహన్ ఉత్సాహంగా చెప్పారు.

అడ్వాన్స్ ఇచ్చిన మూడురోజుల తర్వాత రాజ్‌మోహన్ మా ఇంటికి వచ్చి బాధగా చెప్పారు.

"జంధ్యాలగారు మాట తప్పారు. మా రెడ్డిగారికి తెలిస్తే ఏమవుతుందో అని భయంగా ఉంది."

స్టోరీ డిస్కషన్ సమయంలో క్లయిమాక్స్ నవల్లోది తనకి నచ్చలేదని, ఇంకేదైనా సూచించమని కోరారు. ఎన్నో రకాలుగా ఆలోచించాకే ఆ కథకి అదే సరైన ముగింపు అనుకున్నానని చెప్పాను. నేను ఇంకోటి సూచించలేదు. మన్మధరావు, సర్వాంగసుందరి పాత్రలని తీసేద్దామని జంధ్యాల చెప్పారు. అవి వినోదాన్నిచ్చే పాత్రలే కాబట్టి తీసెయొద్దని నేను సూచించాను. లెంగ్త్ ప్రాబ్లం అని దాన్ని తీసేసారు. రాజ్‌మోహన్ బంధువుల్లోని పుస్తకాలు చదివే అలవాటున్న ఒకరు ఆ రెండు పాత్రలు తీసేసారని తెలిసి ఆశ్చర్యపోయారు. జంధ్యాలగారి సినిమాల్లో రెండు మూడు వదిలేస్తే సాధారణంగా హీరోయిన్లు ఆకర్షణీయంగా ఉండరు అన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ సినిమాకి అంతే ఐంది. నటీనటుల ఎంపిక విషయంలో నిర్మాతల మాట వినలేదు. చిత్ర నిర్మాణంలో అనుభవం లేని కొత్త నిర్మాతల మాటని దర్శకులు ఖాతరు చేయరు. రాజ్‌మోహన్, రెడ్డిగారు వద్దని పట్టుబట్టినా, తనెప్పుడో హీరో వేషం ఇస్తానని మాటిచ్చిన గజల్ శ్రీనివాస్‌ని హీరో పాత్రకి తీసుకున్నారు. నవల్లో లేని కొత్త ట్రాక్‌ని తెచ్చి బ్రహ్మానందం పాత్రని సృష్టించారు. అది జనానికి ఎక్కలేదు. తీసేసిన రెండు పాత్రల విషయంలో కూడా నా మాటేకాక వారి మాట కూడా నెగ్గలేదు. రాజ్‌మోహన్ సూచించిన కీరవాణిని మాత్రం సంగీత దర్శకుడిగా తీసుకున్నారు. కానీ ఒక్క పాట కూడా హిట్ కాలేదు. బహుశ జంధ్యాలగారు ఆయన్ని సరిగ్గా ఉపయోగించుకోలేదు.

జంధ్యాలని అభిమానించే యూత్‌కి 'రేపో మాపో పెళ్ళంట' టైటిల్ బావుంటుందని, 'అహ నా పెళ్ళంట' బాగా ఆడింది కాబట్టి, 'నీకు - నాకు పెళ్ళంట' 'ఓహో నా పెళ్ళంట'లాంటి టైటిల్స్‌తో గతంలో సినిమాలు తీసారు కాబట్టి 'రేపో మాపో పెళ్ళంట' పెట్టమని నేను సూచించాను. కాని ఎస్.వి.కృష్ణారెడ్డిగారు తీసిన 'వినోదం' బాగా హిట్ అవడంతో 'విచిత్రం' అనే పేరుని పెట్టారు.

ఇది జంధ్యాలగారు మనసు పెట్టి తీయని సినిమా అని నా వ్యక్తిగత అభిప్రాయం. చంటబ్బాయ్ రోజుల్లో చూసిన ఆయనలోని క్రియేటివిటీ బాగా తగ్గిందని అనిపించింది. పామ్‌గ్రోవ్ హోటల్లో ఒకేసారి ఐదారుగదుల్లో ఐదారుగురు దర్శకులతో కథా చర్చ చేస్తూ డైలాగ్స్ రాసిన ఆనాటి జంధ్యాలకి, ఈ జంధ్యాలకి తేడాని గమనించి ఆయన గురించి చాలా బాధపడ్డాను. ఆయన వ్యక్తిగత అలవాట్ల ప్రసక్తే మా మధ్య ఎన్నడూ రానిచ్చేవారు కాదు. ఆయన్ని పరిచయం చేసినందుకు ఓ దశలో నేను రాజ్‌మోహన్ గారికి, రెడ్డిగారికి సారీ కూడా చెప్పాను.

సినిమా పూర్తయ్యాక విడుదలకి రెండు నెలల ముందు అన్నపూర్ణ స్టూడియోలో ప్రొజెక్షన్ వేసారు. సినిమా చూసాక ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించిన జొన్నవిత్తుల, జనార్థన్ మహర్షి, తనికెళ్ళ భరణి మరికొందరు క్లైమాక్స్ బాలేదని ఏకగ్రీవంగా చెప్పారు. నేను మౌనంగా ఉండిపోయాను  వారిలో ఒకరు సూచించిన వేరే క్లైమాక్స్‌ని రీషూట్ చేసారు.

సినిమా నవంబర్ 1998లో విడుదలై సూపర్ ఫ్లాపైంది. ఇది జంధ్యాలగారి ఆఖరి సినిమా.

ఆ తర్వాత ఓసారి ఓ టీ.వి సీరియల్ విషయంలో కలుద్దామని ఫోన్ చేసారు. కానీ నేను రెస్పాండ్ కాలేదు. జంధ్యాలగారు గుర్తొచ్చినప్పుడల్లా షూటింగ్‌లో తెల్ల దుస్తుల్లో సింహంలా కనిపించే జంధ్యాల గారే నాకు గుర్తుకు వస్తారు తప్ప మరో రకం జంధ్యాల గుర్తుకు రారు. ఆయన కామెడీకి పెట్టిన వరవడిని అనేకమంది అనుసరించారు. ఆనాటి తెలుగు సినిమా ప్రేక్షకులకి జంధ్యాల గొప్ప వరం. సంభాషణా రచయితగా, దర్శకుడిగా ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించి చిన్న వయసులోనే వెళ్ళిపోయారు.

www.anandbooks.com
www.telugubooks.in

*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*

COMMENTS